క్లుప్తంగా

జిల్లా వాసికి పీహెచ్‌డీ పట్టా



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రానికి చెందిన చెన్నారెడ్డి కుమార్తె మంజుల ఉత్తర ప్రదేశ్‌లోని మోనాడ్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈమేరకు ఆమె 'సౌరశక్తిని ఉత్పత్తి చేయడానికి, సౌరఘటం వర్సెస్ గోళాకార పలక ద్వారా సామర్థ్యాన్ని పెంచడానికి, సౌరశక్తిపై విశ్లేషనాత్మక, తులనాత్మక అధ్యయనం' అనే అంశాలపై పరిశోధన పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఆమె జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. మంజుల పీహెచ్‌డీ పట్టా పొందడం పై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరం

జడ్చర్ల: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 75 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్

జడ్చర్ల: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక(14)ను స్థానిక యువకుడు రాజు (21) కిడ్నాప్ చేసినట్లు సీఐ రమేశ్‌బాబు ఆదివారం తెలిపారు. బాలిక 9వ తరగతి చదువుతోందని అన్నారు. ఈమేరకు నిందితుడు రాజుపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

అడ్డాకుల: మూసాపేట పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం...వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన సతీష్, మాధవి దంపతులు శంషాబాద్‌లో ఉంటూ కూలీ పని చేస్తున్నారు. స్వగ్రామానికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం బయలుదేరారు. మార్గమధ్యలో మూసాపేట శివారులోని ఈద్గా దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరు ఎగిరి కిందపడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో మాధవి తల నుంచి రక్తస్రావమైంది. సతీష్ తలకు హెల్మెట్ ధరించడంతో ప్రమాదం తప్పిపోయి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ద్విచక్రవాహనానికి ఆటో తగలడంతోనే ప్రమాదం జరిగినట్లు అక్కడున్న వారు తెలిపారు. దీనిపై మూసాపేట పోలీసులు విచారణ చేపట్టారు.

గోశాలకు విరాళం

దేవరకద్ర రూరల్ : కౌకుంట్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీగోశాలకు ఆదివారం అదే గ్రామానికి చెందిన శ్రీ చెన్నకేశవ స్వామి భజన మండలి సభ్యులు రూ.10,116 లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

రాజాపూర్: క్రీడలతో శారీరక ఆరోగ్యం సమకూరుతుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం బాలానగర్ మండలంలోని చిన్నరేవల్లి గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి చాలా గ్రామాల్లో యువత వాలీబాల్ ఆడటం చూస్తుంటామని, దానివల్ల ఐక్యత పెరగటంతోపాటు క్రీడాస్ఫూర్తి కలుగుతుందన్నారు. తమ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి ప్రాంగణాలు ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మి, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, నాయకులు వెంకట్రాములు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై ఏర్పడిన చిన్నపాటి గుంతల వల్ల వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించిన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వయంగా వాటిని పూడ్చారు. వివరాల్లోకి వెళితే భూత్పూర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లేదారి గుంతలు పడటంతో అక్కడ విధుల్లో ఉన్న మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సుధాకర్‌గౌడ్ అనే కానిస్టేబుల్ గుర్తించారు. స్వయంగా మట్టిని తీసుకువచ్చి గుంతలు పూడ్చేశారు. ట్రాఫిక్ తక్కువగా ఉన్న సమయంలో పనులు చేపట్టినట్లు 'సాక్షి'కి తెలిపారు.



గజిబిజిగా గల్లీలు

- 5ఫీట్ల రోడ్లు
- ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- పాత డ్రైయినేజీలే దిక్కు
- ఎటు చూసినా దుర్గంధమే

25వ వార్డులో జనాభా: 6,450
ప్రధాన వీధులు: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగం, గౌడ్స్ కాలనీ, గచ్చిబౌలి, గోల్‌మసీదు ప్రాంతం

వార్డ్ వాచ్



రాయచూర్ మెయిన్ రోడ్డు నుంచి గోల్ మసీదుకు వెళ్లే దారిలో ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నం.25 పరిధి లో ఎన్నో సమస్యలు కొలువుదీరాయి. జైల్‌ఖానా వెనుక భాగం లోని గచ్చిబౌలిలో గల్లీలన్నీ ఇరుకుగా.. గజిబిజిగా ఉన్నాయి. మూడేళ్లక్రితం కొన్ని విద్యుత్ స్తంభాలను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. ఆపై కొందరు ఇంటి యజమానులు ఎవరికి వారు మెట్లతో పాటు రెయిలింగ్ నిర్మించుకున్నారు. కనీసం ఐదు ఫీట్లకు మించి సీసీ రోడ్లు లేవంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అన్నీ పాత డ్రెయినేజీలే కావడంతో మురుగు సమస్య ఇబ్బందులు పెడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అక్కడక్కడా కొత్తగా నిర్మించినా పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కాలేదని అంటున్నారు. దీనికి తోడు లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరు ఎక్కడికక్కడ గంటల తరబడి అడుగు లోతు నిలిచిపోతోందని చెబుతున్నారు. కాలినడకన బయటకు వెళ్లాలన్నా.. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా ఇంటివరకు కనీసం ఆటోనైనా వచ్చే పరిస్థితి లేదు. శుభకార్యాలు, ఇతర ఏ కార్యక్రమాలు ఇంటి వద్ద నిర్వహించుకోవాలన్నా ఇబ్బందులు పడాల్సిందేనని వాపోతున్నారు. మరోవైపు మిషన్‌భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటిలో ఒండ్రు కలిసి కలుషితమవు తోందన్నారు. ఇక గోల్‌మసీదు ప్రాంతంలో సీసీరోడ్లు చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. ఎక్కువగా పాత డ్రెయినేజీలు ఉండడంతో రోడ్లపైకి వర్షపునీరు చేరి ఏరులై పారుతుందని స్థానికులు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం భవన ప్రాంగణంలోకి వరద వస్తుందని అంటున్నారు. ఆ సమయంలో పిల్లలను పాఠశాలకు పంపించాలంటేనే భయమేస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడి గంటల తరబడి విద్యుత్ సరఫరా ఆగిపోతుందని రెండోది బిగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. గౌడ్స్‌కాలనీలో ఇటీవల మిషన్ భగీరథ పథకం పైపులైన్ అసంపూర్తిగా వేశారని, ఇంకా కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. మెయిన్‌రోడ్డు నుంచి ఖలీల్ మసీదు గల్లీ వెంట రోడ్డు మధ్యలోనే నాలుగు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో సగం మట్టి రోడ్డు, మిగతా బీటీ ఉన్నా పలు చోట్ల ధ్వంసమైంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఇళ్ల మధ్య పదుల సంఖ్యలో కట్టెల మండీలు, టింబర్ డిపోలు ఉన్నాయి. వాటి ద్వారా వెలువడే పొట్టుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఖలీల్ మసీదు ప్రాంతం లోని గల్లీలో..

కొసమెరుపు..

కాగా వార్డు పరిధిలో నెలకొన్న ఆయా సమస్యలతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్ సురయ్యాబేగాన్ని వివరణ కోరేందుకు 'సాక్షి' ఎన్నిసార్లు యత్నించినా స్పందించకపోవడం గమనార్హం.

ఎటు చూసినా దుర్గంధమే



అసలే చిన్న గల్లీలు.. ఆపై పాత డ్రెయినేజీలే ఉండడంతో ఎటు చూసినా దుర్గంధమే. మొత్తం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నీరు గంటల తరబడి ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. బురదలోనే నడవాల్సి వస్తుంది. అంబులెన్స్ లేదా కనీసం ఆటోనైనా రాని విధంగా ఇరుకు రోడ్లు ఉన్నాయి. దీనికి తోడు కొందరు వ్యక్తులు ఇంటి ఎదుట మెట్లు, రెయిలింగ్ నిర్మించుకున్నారు. కొన్నిచోట్ల రోడ్డు మధ్యలోనే స్తంభాలు పాతి తీగలు లాగారు.

– మహ్మద్ జాబేర్, గచ్చిబౌలి వాసి

ఓవర్ లోడ్‌తో ట్రిప్ అవుతోంది



సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్ లోడ్ పడింది. దీంతో తరచూ ట్రిప్ అవుతుండటంతో విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోతుంది. రెండో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తే సరిపోతుంది. ఉర్దూ మీడియం హైస్కూల్ పక్క నుంచి పెద్ద నాలా ఉంది. సమస్యలను ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. కౌన్సిలర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదు.

– మహ్మద్ చాంద్‌పాషా, గోల్‌మసీదు ప్రాంతం

మైసమ్మ చెంత జనజాతర

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం మరో రెండు రోజుల్లో రానుండటంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.



మైసమ్మ దేవాలయం ఆవరణలో భక్తులు

బ్రాహ్మణ సేవావాహిని కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎన్‌టీఆర్ కల్యాణ మండపం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణసేవా వాహిని గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవా వాహిని రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ బెస్ట్‌స్కీంలో బ్రాహ్మణులకు స్వయం ఉపాధి కింద రూ.5లక్షల రుణాలు అందజేస్తారని, బ్రాహ్మణ సేవా పరిషత్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 60 ఏళ్లపైబడిన వేదపండితులకు నెలకు రూ.5వేలు భత్యం అందజేస్తారని, వీటి దరఖాస్తులను కూడా తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శేషం రఘు కిరణాచార్యులు, జిల్లా అధ్యక్షుడు కరణం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్‌పోటీలు

జడ్చర్ల టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని అవోపా ఆధ్వర్యంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో తనీష్, శ్రేష్టల్, విఘ్నేష్ విజయసాధించారు. జూనియర్ విభాగంలో ఫైజల్, దుర్గాప్రసాద్, సాత్విక్‌లు, సీనియర్ విభాగంలో లక్ష్మణ్, నవీన్, శివకుమార్‌లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమానికి అవోపా జిల్లా కార్యదర్శి మురళీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పర్యవేక్షించారు.



చెస్‌పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామం నుంచి ఆగారం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన నర్సిములు వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పొలంలో మూడు స్తంభాలు వరుసగా ఒకవైపు ఒరిగి కిందపడేలా ఉన్నాయి. వీటికి కొంత దూరంలో విద్యుత్ నియంత్రిక వద్ద ఒక స్తంభం ఇదే విధంగా ఉంది. పెద్దగా గాలులు వీస్తే స్తంభాలు కిందపడేలా ఉన్నాయి. మూడు స్తంభాలు రోడ్డుకు దగ్గరలో ఉండటంతో అవి కూలి రోడ్డుపై పడి ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కళ్ల కలక నివారణపై అవగాహన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 47వ వార్డు పరిధిలోని నీలకంఠ మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద ఆదివారం వీరహనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడు దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు కండ్ల కలక నివారణపై అవగాహన కల్పించారు. అలాగే కంటి మందును సైతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 14వ వార్డు కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎ.అంజయ్య మాట్లాడుతూ కంటికలకపై ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మందులు వాడటం వల్ల దీనిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిరంజన్, అంబుదాస్, శుభం అనిల్, రోహిత్, శివ తదితరులు పాల్గొన్నారు.



మందును పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అంజయ్య

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వీరశైవ జంగమ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం శిల్పారామంలో నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా శివరాజు, ప్రధానకార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా రవికుమార్‌లు ఎన్నికయ్యారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సగర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత కుల వృత్తులకు ఆదరణ పెరిగిందన్నారు. హైదరాబాద్‌లో సగర ఆత్మగౌరవ భవనానికి రూ.150 కోట్ల విలువైన భూమిని ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ వెంకటయ్య, గద్వాల అడిషనల్‌కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మహమ్మదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇస్తున్న రూ. లక్ష ఆర్థికసాయం చెక్కులను సోమవారం గండేడ్ మండల కేంద్రంలో పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్, భిక్షపతి తెలిపారు. మహమ్మదాబాద్, గండేడ్ మండలాలకు కలిపి ఉదయం 11గంటలకు గండేడ్‌లోనే ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేతులమీదుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు అధికసంఖ్యలో హాజరుకావలని కోరారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డె శాంతన్న మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి రూ.5వేలను పంపడంతో వాటిని బాధిత కుటుంబానికి అందజేశారు. పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బగ్గి బాలరాజు, నిరంజన్, నరసింహ, వడ్డె శేఖర్, గోవర్ధన్‌గౌడ్, ఖాసీం ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారు

స్టేషన్ మహబూబ్‌నగర్: అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో అరాచక పాలన సాగుతోందని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ప్రజాస్వామికబద్ధంగా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారని, ఓర్వలేని కొందరు నాయకులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా రాజకీయాల్లో బీఆర్ఎస్ నాయకులు కొత్త ఒరవడి సృష్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రిపై కేసు నమోదైతే దానిపై ప్రతిపక్ష నాయకుడు మాట్లాడితే దానిపై సంస్కారహీనంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కోడూర్ శివారులోని తన వ్యవసాయ భూమిలో ఫెన్సింగ్‌లను తొలగించారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

దేవరకద్ర: చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. రెండు మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో పాటు జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభ

చిన్నచింతకుంట: మండలంలోని పర్దిపురంలో ఆదివారం ప్రజా గాయకుడు గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభలను టీఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్ హాజరై నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి తోపాటు కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖలీల్

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం బైరంపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతి భవనం, గ్రామీణ క్రీడా ప్రాంగణం ప్రారంభించి మాట్లాడారు. ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. శివాలయం సమీపంలోని వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం వేముల పంచాయతీ పరిధిలోని తమ్మడికుంట తండాలో నిర్వహించిన తీజ్ వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖా, సర్పంచ్ మల్లమ్మ, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, బాలు పాండుయాదవ్, శివప్రసాద్, కాడయ్య, గోపాల్, జగన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

జడ్చర్ల టౌన్: వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టంపల్లి, తంగెళ్లపల్లి, గంగాపురం, చర్లపల్లి గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని ధరలు పెరిగి సామాన్యుడు ఏం కొనలేక, తినలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్ధాకలితో కూలీలు, కార్మికులు బతుకీడుస్తున్నారన్నారు. వ్యవసాయంలో కంటికి కనిపించని దోపిడీ జరుగుతుందని అందుకే కనీస వేతనాలు అమలు చేస్తే సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధక్షులు ఆండాలు, నాయకులు సాయిలు, సుందరమ్మ, జయరాములు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం



గ్రామ పంచాయతీ భవనంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. రూ. 20 లక్షలతో జీన్గురాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు. అంతకుముందు కళాకారులు డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహరెడ్డి, నాయకులు కొండరెడ్డి, భాస్కర్ రెడ్డి, శివరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

మిడ్జిల్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జడ్చర్ల-కల్వకుర్తి ప్రధాన రహదారిపై ప్రైవేట్ వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగతున్నాయని అంటున్నారు. అదే విధంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాపోతున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై వాహనాలు నిలపకుండా అవగాహన కల్పించాలని కోరుతున్నారు.



మిడ్జిల్‌లో ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు



మైత్రినగర్‌లో వికసించిన బ్రహ్మకమలం



జైనల్లీపూర్‌లో ..

వికసించిన బ్రహ్మ కమలాలు

మహబూబ్‌నగర్ రూరల్: సంవత్సరానికి ఒకసారి వికసించే బ్రహ్మ కమలం పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. జిల్లాలోని పలువురి ఇళ్లలో ఆదివారం ఇవి వికసించడంతో చుట్టు పక్కల వారు వాటిని చూడడానికి ఆసక్తి చూపారు. జిల్లాకేంద్రంలోని మైత్రినగర్‌లో కాలేకర్ నాగమణి, అదేవిధంగా మండల పరిధిలోని జైనల్లీపూర్‌లో సున్నల రాములు అనే రిటైర్ట్ ఉద్యోగి ఇళ్లలో ఈ పుష్పాలు వికసించాయి.